# అచలపతి- భాగవిపణి

**జీ**వితంలో పైకి వచ్చిన వాళ్ల కాలిక్రింద పక్కవాడి తలకాయ ఉంటుందని కొందరంటారు. పక్కవాడు బాగుపడ్డాడని తెలిస్తే ఇంట్లోంచి పీనుగెళ్లినట్టు ఏడుస్తారంటారు హాస్యబ్రహ్మ. ఈ సిద్ధాంతానికి అపవాదుగా జనాభాలో కొంత శాతం పక్కవాడిని పైకెళ్లమని ప్రోత్సహిస్తారు. ఆ శాతాన్ని స్కూలు టీచర్లు నింపగా మిగిలినది నింపేవాళ్లు షేర్ కనసల్టెంట్స్.

కొంతమంది అభిప్రాయం ప్రకారం చదరంగం ఆడేవాడికి పక్కనుండి సలహాలు చెప్పేవాడి పాత్రయే షేర్ కన్సల్టెంట్లు పోషిస్తారు. తన మాట విని ఎత్తేసిన ఆటగాడు చిత్తయే క్షణంలో చల్లగా జారుకుంటారు. ఒకవేళ ఆ ఆటగాళ్లు ఆశ పెరిగిన ఆడవాళ్లయితే అలా జారుకోవడం సాధ్యపడుతుందా..?

ఆ రోజు ఉషా(ర)త్తయ్య తన పత్రికలో నడిపే షేర్ కాలమ్ వల్ల కొని తెచ్చుకొన్న అవస్థ వింటే జాలేసింది.

ఉద్యోగాల తోవ తొక్కక గృహిణిగా మిగిలిన ఆడవాళ్లు ఇల్లునీ, పిల్లల్నీ, మొగుణ్నీ నమ్ముకుని ఇంట్లోనే ఉండేవారు. ఉద్యోగినుల పత్రికలలో 'ఆఫీసుల్లో ఆడవాళ్ల ఆగచాట్లు', 'స్త్రీకి గృహమే కదా పరమపదము' వంటి వ్యాసాలు రాస్తే ఆ రాతలు చదివి, నమ్మి "మీరు రాజీనామా చేసి ఆ పరమపదము నందుకోవచ్చు కదా!" అని అడగాలని తోచక, హ్యాపీగా ఉండేవారు.

కానీ ఇటీవలికాలంలో పక్కింటి ఉద్యోగినుల డంబాలు, ఆడంబరాలు చూస్చూసి తమ తెలివితేటలపై తమకే నమ్మకం తగ్గడం గమనించి, ఏం చేసి డబ్బు సంపాదించాలని ఆలోచించడంపై దృష్టి సారించారు. చీరలు వాయిదాలపై అమ్మడాలూ,ఎల్లయిసీ ఏజెంటుగిరీ చేపట్టడాలూ వాటిలో కొన్ని. ఈ మధ్య షేర్‌బజారువైపు వాళ్ల ఆలోచనలు సాగడంతో అత్తయ్య తన 'పసుపు' పత్రికద్వారా వాళ్లను ఆకట్టుకోవాలని చూసింది.

అన్ని రంగముల ఆడవాళ్లు మగధీరుల నెదిరించాలని నమ్మేవాళ్లలో మా ఉషారత్తయ్య ఒకర్తె. కానీ భర్త కలిసిరాకపోవడంతో ఆవిడ ప్రయత్నాలు ఫలించలేదు. మహిళల కోసమే నడిపే తన 'పసుపు' పత్రిక ద్వారా షేరుమార్కెట్లో ఏ కంపెనీ షేర్లు కొనాలో ఏవి మానాలో సలహా లిచ్చే కాలమ్ ఒకటి పెడదామనుకుంది. పేరు ప్రఖ్యాతులున్న కన్సల్టెంట్లకు పారితోషికం ముట్టచెప్పటానికి స్తోమత లేనందున తనే ఇంగ్లీషు మాగజైన్ల నుండి కాపీ కొట్టి తెలుగులో రాసేయసాగింది.

కాలమ్‌పేరు 'షేర్–ఎ–షేర్'ట. మొదటి మాట ఉర్దూషేరట. (అంటే సింహంట –పులి కాదూ?) రెండోది ఇంగ్లీషు షేరట. మధ్యలో 'ఎ' అంటే 'ఆఫ్'ట. ఇది పారశీయో, అరబిక్కో! తెలుగులో పేరెందుకు పెట్టలేదన్నాను. 'షేర్ మార్కెట్'కు తెలుగు మాట లేదట. కాస్త ఆలోచించి 'భాగ విపణి' అనబోయాను. సంస్కృతం చొరబడిందనిపించింది. ఎన్టీయార్ అన్నిటికీ తెలుగు పేర్లు పెడుతూన్నానని అడావుడి చేసి సంస్కృత పేర్లు పెట్టాడు. మనమూ అదే చేస్తే ఎలా? ఆలోచించాలి.

తర్వాత ఆలోచిద్దువుగాని ముందు నా గాథ వినమంది అత్తయ్య.

పాఠకురాళ్లు ఆ కాలమ్‌ని మహా ఆదరించారట. వాళ్ల బ్లాక్ మనీ అంతా షేరు బజారుకి మళ్లించారట. 'నీ కెందుకూ శేర్లూ, కుంచాలూ' అనే హేళనలను పట్టించుకోకుండా, పెళ్లయితే మొగుడ్ని, కాకపోతే తలిదండ్రులను బెల్లించి, మభ్యపెట్టి, మెరుగు పెట్టడానికి కంసాలి కిచ్చేనని అబద్ధాలు చెప్పి దాచిన నగల్ని కుదువబెట్టి, చేబదుళ్లు చేసి – డబ్బులు పుట్టించి షేర్లలో పెట్టుబడి పెట్టారట. ఒకవేళ చెడితే తోడుంటారు కదాన్న దూరపుచూపుతో ఇరుగింటి పొరుగింటి ఇందుమతులకు కూడా పురెక్కించారట.

మొగుడు షేర్లు కొందామంటే 'కాదు పట్టు చీరలే కొందామ'ని పంతం పట్టిన ఇరుగింటి ఇందుమతులు పొరుగింటి పద్మావతుల సలహాలకు చెవి ఒగ్గి, తమ శక్తి కొలదీ, విభవము కొలదీ ఇంట్లో పాతసామాను అమ్మేసైనా షేరుబజారు పాలయ్యేరట. ఆడవాళ్లకు ఆశ పెరిగితే లేడీ మేక్‌బెత్‌లవుతారని షేక్స్పియరోవాచ.

వీరందరి ప్రోత్సాహంతో 'పసుపు' పత్రిక అమ్మకాలు ఇంతింతై మా అత్తయ్య ఆనందం నభోమండలంబున కల్లంతయై, ఆత్మవిశ్వాసం అదేదోదానికి బౌండరీయై స్వంత తెలివితేట లుపయోగించి టిప్స్ ఇవ్వడం మొదలుపెట్టిందట. దాంతో వచ్చింది ముప్పు.

అప్పట్లో షేర్ మార్కెట్లో నీలపు తునక కంపెనీగా వెలిగే బొంబాయివాలా కంపెనీకి

ప్రతిగా ఓ గుజరాతీవాలా ఎదగడం మొదలెట్టాడు. మా అత్తయ్య గుజరాతీవాలా గ్రూప్ కంపెనీల షేర్లను కొనమని తన శిష్యురాళ్లకు సలహాలు ఇవ్వటం మొదలుపెట్టింది. వాళ్ల బాలెన్స్‌షీట్లో అత్తయ్యకు నచ్చిన అంశం ఏమిటని అడిగేను నేను. పేపర్లో వేసినప్పుడు మూల వేసిన చైర్మన్ ఫోటోలో అతని హెయిర్ స్టయిల్ నచ్చిందట!

అత్తయ్య పుణ్యంపుచ్చి గుజరాతీవాలా ఏ దారి దొరికితే ఆ దారిన చకచకా పైకెగబాకుతుంటే, బొంబాయివాలా జరజరా క్రిందకు జారసాగాడు. పాఠకురాళ్లు 'ఓహో అత్తయ్య' అన్నారు. అత్తయ్య ఆత్మవిశ్వాసం అంచులుదాటి తనకు ఇంట్యూషన్ ఉందని నమ్మే స్థాయికి చేరుకుంది.

ఇంతలో గుజరాత్‌వాలా కొడుకు సినీతారతో గడ్డిలో పొర్లాడుతున్నాడని (అర్థమునకై ఆంగ్లములోనికి అనువదించి చూడుడు). సినీ(లి)పత్రికలు బుగ్గలు నొక్కుకోవడంతో వారి నోళ్లు నొక్కడానికి గుజరాత్‌వాలా విచ్చలవిడిగా కంపెనీ డబ్బు ఖర్చుపెడుతున్నాడని పుకారు గుప్పుమనడంతో షేర్ మార్కెట్లో అతని వెలుగు గప్పుమని ఆరిపోయి, షేరు ధరలు కిందకు దొర్లడం మొదలెట్టాయి. జాంబవంతరావు అనే షేరు బ్రోకరు బేరిష్ ట్రెండును పసిగట్టి షేరు ధరలు మరింత పడగొట్టి తక్కువ ధరల్లో షేర్లు కొనాలని ప్లానేసి ఇతోధికంగా పుకార్లను పెంచేడు.

తాము కొన్న షేర్ల ధరలు దిగజారి, జారి తమ ఆశల పేకమేడలు కూలిపోతుంటే కంగారు పడిన 'పసుపు' పాఠకురాళ్లు కొంతకాలం తేలు కుట్టిన దొంగల్లా ఉన్నా, తేలు క్రమంగా మండ్రగబ్బవుతుండటంతో భయపడి మొగుళ్లతో షేరు రహస్యాలను 'షేరు' చేసుకున్నారు. దాంతో మొగుళ్లు పెళ్లాల్ని కాసేపు తిట్టి, ఆపై తమ కోపాన్ని ఉషారత్తయ్యపై మళ్లించారు –పాడు సలహాలిచ్చినందుకు. బెదిరింపు ఉత్తరాలూ, ఫోన్‌కాల్సూ, పత్రికాఫీసు బయట ప్రదర్శనలూ జరగడంతో గుండె చెదరి, గుజరాత్‌వాలా కంపెనీల షేరు పెరిగేట్లు చూసే భారం తనదని హామీ ఇచ్చి, అత్తయ్య నా దగ్గరకొచ్చి సలహా అడిగింది.

ఈ కథలు ముందు నుండీ చదవకుండా కేవలం పుస్తకాలషాపులో చూసి పడేద్దామని వచ్చి పేజీలు తిప్పేవారి దృష్టి పై పేరాగ్రాఫ్ పై పడితే వాళ్లు పొరబడే అవకాశం ఉంది – షేరు బజారు విషయంలో సలహాలు చెప్పమని అత్తయ్య నన్ను కోరిందని!

కానీ కఠోరవాస్తవం ఏమంటే సలహాలు చెప్పాలని నా అసిస్టెంటు అచలపతిని ఆదేశించవలసిందని అత్తయ్య అభ్యర్థన. నేను అంశాలవారీగా అత్తయ్యకు నచ్చచెప్ప

బోయాను.

క) రాజుగారి పెద్ద భార్య సామెతలా అసిస్టెంటు తెలివైనవాడవుతే యజమాని తెలివితక్కువ వాడయితీరాలన్న గ్యారంటీ లేదు.

ఖ) అచలపతికి షేరుబజారుపై సదభిప్రాయం లేదు. అది ఓ రకం జూదం అంటాడు. పాతకంపెనీ షేర్లు కొనడానికి పెట్టే పెట్టుబడిని కొత్త కంపెనీలు పెట్టడానికి వినియోగిస్తే ఉత్పత్తి పెరుగుతుంది. ఉద్యోగావకాశాలు పెరుగుతాయి అంటాడు. అందువల్ల అతన్ని సలహాలడిగి ప్రయోజనం లేదు.

గ) నాకు కొన్ని వాటిల్లో ప్రావీణ్యత తెలీదన్నమాట ఒప్పుకుంటాను. ఆ మాటకొస్తే ఎన్టీరామారావుకి విమానం నడపడంరాదు. (కో పైలట్‌ని పెట్టుకుంటే కొంప మళ్లీ ముంచుతాడని భయం). రాజీవ్‌గాంధీకి కిష్టుడివేషం కట్టడం రాదు. అయినా ఇద్దరూ రాజకీయరంగానికి పనికొచ్చేరు. అలాగే నేనూ షేరురంగంలో పులినో, సింహాన్నో కావచ్చు.

ఘ) ఈ ఎత్తులూ పై ఎత్తులూ వేయడానికి చాలా ఖర్చవుతుంది. మావయ్య డబ్బివ్వక పోవచ్చు. నాకు ఆట నడిపే అవకాశం యిస్తే ఆ ఖర్చు నేను పెట్టుకొంటాను.

(ఘ) అంశం తనకు నచ్చిందన్నది అత్తయ్య. ఒళ్లు దగ్గరెట్టుకొని షేరు మార్కెట్టును ఆడించమంది. లేకపోతే రెండు ప్రాణాలు పోతాయన్నది.

"మీ పాఠకురాళ్ల చేతిలో పోయేది నీ ప్రాణం ఒక్కటే కదా?"అని అడిగేను.

"వాళ్లు నా ప్రాణం తీసేక నేనూరుకుంటానా? వచ్చి నీ ప్రాణం తీయనూ?"

"చచ్చిపోయాక నీవెలా.."

"దయ్యమై వస్తా. నీకు నమ్మకం లేదంటావా? అయితే ఉండు. వచ్చే సంచికలోనే 'ఇన్నాళ్లుగా నాకు షేరు విషయంలో సలహాలిచ్చిన ఆనంత్‌గారికి ధన్యవాదాలు. వారి ఎడ్రసిదిగో' అని వేసేస్తాను. ఆ పైన నువ్వూ వాళ్లూ పడుదురుగాని".

ముంచుకొచ్చే ముప్పును గ్రహించలేకపోవడానికి నేనేం గోర్బచేవ్‌ని గాను. "అన్యాయం, నువ్విలా చేస్తే (ఘ) అంశంలో నేను సాయపడలేను".

"సరే లేరా, సరదాకంటే అంత భయపడతావేం? పోన్లే నీ ప్రతాపమేమిటో చూపించు, గుజరాతీవాలాను నిలబెట్టు. అదే చాలు".

"అలా అన్నావు బావుంది. చాణక్యుణ్ణీ, కౌటిల్యుడ్నీ మించిన తెలివితేటలతో కథ నడిపిస్తాను, చూస్తూండు".

"వాళ్లిద్దరూ ఒక్కరేనేమో!?"

"ఒకరేనా!? అయితే కావచ్చు. అయినా సరే. శపథం విషయం వచ్చినప్పుడు చాణక్యుడంటే బాగుంటుంది. ఎత్తులకుపైఎత్తుల విషయంలో కౌటిల్యుడంటే బాగుంటుంది. నేను వాక్యాల్ని మార్చను. అది నా పాలసీ".

"నీ ఇష్టం వచ్చినట్లు అఘోరించు".

అత్తయ్య వెళ్లిపోయాక తీవ్రంగా ఆలోచించి బొంబాయివాలాను ఎలాగైనా క్రింది కీడ్చుడానికి అబద్ధపు ప్రచారమే శరణ్యమని అనుకొన్నాను. 'ప్రేమలో, పోరాటంలో ఎలా చేసినా న్యాయమే' అన్నాడు ఇంగ్లీషువాడు. జ్యోతిష్యశర్మ గారిని కలిసి డబ్బిచ్చి నా ప్లాను చెప్పాను. ఆయనో ప్రెస్ కాన్ఫరెన్సు పెట్టి "ఫలానా బొంబాయివాలా గ్రహాలన్నీ ఒకళ్లింట్లో మరొకళ్లు ఉన్నారు. కాబట్టి అతనార్నెలల్లో మరణించడం ఖాయం. పై సంక్రాంతికి నేను మరో కాన్ఫరెన్సు పెట్టి ఈ విషయం మీ అందరికీ గుర్తు చేస్తాను" అన్నాడు.

నా ఉప్పు తిన్న (తాగినవాటి వివరాలీయటం లేదు) పాత్రికేయులు ఆ వార్త ప్రముఖంగా ప్రచురించారు కానీ దాని పక్కనే జ్యోతిషశర్మగారి మరణ వార్త కూడా బాక్స్ కట్టి ప్రచురించారు. (పేపరువాళ్ళకి సెన్సాఫ్ హ్యూమర్ లేదని ఎవరన్నారు?) కాన్ఫరెన్సు అయిన అరగంటకే ఆయన పోయేట్ట! తన సంగతి తనే ఎరుగనివాడు మరొకడి భవిష్యత్తు గురించి ప్రకటనలిస్తే వాటికి విలువేముంటుంది? జనాలు బొంబాయివాలాలో నమ్మకం కోల్పోలేదు.

కానీ నా చర్యలకు ప్రభావం లేకపోలేదు. రెండు పరిణామాలు సంభవించాయి. ఒకటి – అత్తయ్య నుండి పోస్టు పార్శిల్‌లో అక్షింతలమూట రావటం, రెండు – బొంబాయివాలా కంపెనీ వాళ్లు డర్టీట్రిక్స్ డిపార్ట్‌మెంట్ (నక్కజిత్తుల విభాగం) తెరవడం.

ఆ తర్వాతి ఆర్నెల్లూ పత్రికలలో వార్తల ద్వారా బేటిల్ ఆఫ్ విట్స్ అనగా బుద్ధిజీవుల యుద్ధం (జీవుల కాదు 'హీనుల' అని అత్తయ్య సవరింపు) జరిగింది. నా మేధస్సు, ఓజస్సు, పర్సు చాలా ఖర్చుయ్యేయి. గుజరాత్‌వాలా కంపెనీ వాళ్లు మా కృషిని గమనించి, తెరచాటునుండీ సహాయం అందించేరు. చిన్నప్పుడు స్కూల్లో సున్నితపు త్రాసు చూసేను. గాజు తలుపు తీస్తే అల్లల్లాడిపోయేది. ఈ షేరుమార్కెటు ధరలు గాజుతలుపు తీయకుండానే అల్లల్లాడిపోయే రకాలు. ఏ చిన్న వార్త వచ్చినా గాలిలో దీపంలా తెగ ఆడిపోయేవి. ఇంత సెన్సిటివిటీ గడియారం పెండ్యులానికి ఉండివుంటే గడియారం



నుండి దూసుకొచ్చి బయటకు పడిపోయి ఉండేది.

కంపెనీచైర్మన్ వ్యక్తిగత విషయాలు బజారుకీడ్చి షేరు ధరలతో దోబూచులాడిన కొంత కాలానికి సంగతులేమీ దొరక్క అసలు వీళ్లు తయారుచేసే వస్తువులేమిటో,

వాటి అమ్మకాలెలా ఉంటాయో కనుక్కొని ఆ సమాచారాన్ని కూడా షేరు ధరల్ని ప్రభావితం చేయడానికి ఉపయోగించాం.

రెండు కంపెనీల వాళ్లూ ఊరగాయల్లోనూ, డబ్బాల్లో ప్యాక్ చేసి అమ్మే తినుబండారాల్లోనూ ఉపయోగించడానికై ఉప్పు తయారుచేస్తారు. అయితే బొంబాయివాలా వాళ్లది నూరిన ఉప్పు అయితే గుజరాత్‌వాలాది నూరని ఉప్పు. వాటి వాడకాలను గురించి కూడా ఇరుపక్షాల వారమూ కల్పితవార్తలను గుప్పించడం జరిగింది. పాఠకులకు విసుగు పుట్టకుండా ఆ అంశాలు క్లుప్తంగా ఇస్తున్నాను –

బొంబాయివాలా షేర్ల ధరలు తరగడానికీ, గుజరాత్‌వాలా కంపెనీ షేర్ల ధరలు పెరగడానికి కారణభూతాలైన వార్తలు –

ఒకటి : బొంబాయివాలా ఒక హోటల్లో రిజష్టర్లో ఇంటి పేరు రాయకపోవడం చేత 'ఇమ్‌పెర్సనేషన్' చేయడానికి ప్రయత్నిస్తున్నాడన్న ఆరోపణపై ఆరెస్టు కాబోతున్నాడన్న వార్త రావడం

రెండు : గుజరాత్‌వాలా తమ్ముడి మావగారి తోడల్లుడి పక్కింటాయన కేంద్రంలో మంత్రి కాబోతున్నాడని అనుకోవడం

మూడు : బొంబాయివాలా భార్య పెట్టి సర్దుకుంటూండగా పక్కవాళ్లు చూడడం వలన భర్తపై అలిగి పుట్టింటికి వెళ్లిపోతానందన్న పుకారు పుట్టడం

నాలుగు: బొంబాయివాలా గ్రూపు నడిపే హోటల్లో సూపులో బొద్దింక వచ్చిందని ఫారిన్‌టూరిస్టు పోలీసులకి కంప్లయింట్ చేయడం

ఐదు: నూరిన ఉప్పులో పోషకపదార్థాలు నశించి పోతాయని రిటైరైన సైంటిస్టుగారి అభిభాషణ

ఆరు: పదేళ్ల తర్వాత రాబోయే భూకంపానికి కేంద్రం బొంబాయివాలా ఫ్యాక్టరీకి జస్ట్ అయిదువందల కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉంటుందన్న అంచనా

ఏడు: ఉప్పును పొడి చెయ్యటం వల్ల దానిలో ఆమ్ల లక్షణాలు నశించి పొట్ట యొక్క రోగ నిరోధక శక్తిని నశింపజేస్తుందని గ్రహించి అమెరికన్లు , వాళ్లు పొడిచేసి పెట్టుకొన్న ఉప్పంతా మనకు ఎగుమతి చేసేయబోతూండడం వల్ల మార్కెట్టంతా మెత్తటి ఉప్పుతో నిండిపోయి దాని ధర పడిపోతుందన్న భోగట్టా.

ఎనిమిది : నేచర్ ఫ్రెండ్లీ అయిన సహజలవణాన్నే ప్రోత్సహించి చౌక దుకాణాల

ద్వారా సరఫరా చేసే పథకం ప్రభుత్వం పరిశీలనలో ఉన్నట్టు అభిజ్ఞవర్గాల కథనం.

తొమ్మిది : రాబోయేది కష్టకాలమే కాబట్టి జనాలు కన్నీరు మున్నీరుగా విలపించి కన్నీరును ఎండబెట్టుకొని మెత్తటి ఉప్పు చేసుకోగలరు, కానీ రాళ్ల ఉప్పు దొరకదు– అనే ఊహ.

గుజరాత్‌వాలా కంపెనీల షేర్ల ధరలు తరగడానికి / బొంబాయి వాలా షేర్ల ధరలు పెరగడానికి దోహదం చేసిన కారణాలు :

ఒకటి : గుజరాతీవాలా నేపాల్లో 'కాసినో రాయల్' లో రష్యన్ రౌలట్ ఆడుతున్నట్టు ఫోటో ప్రచురణ.

రెండు : ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడుతున్న తన కంపెనీ లాభాలనేంచేయాలో తెలియక బొంబాయివాలా తన అద్దాల మేడలో స్విమ్మింగ్ పూల్ కట్టిస్తున్నాడన్న వార్త.

మూడు : గుజరాత్‌వాలా పెద్దకోడలు ఓ రోజు చేతికి కట్టుతో కనబడడంతో వరకట్నం కోసం కోడల్ని బాధించారన్న ఆరోపణపై అతను అరెస్టవబోతున్నాడన్న పుకారు.

నాలుగు : గుజరాత్‌వాలా భవనానికి దగ్గరలో ఉన్న నది వర్షాల వల్ల పొంగడం.

ఐదు : ఇది వరకు ఐ.ఎమ్.ఎఫ్. కాన్ఫరెన్స్‌ల్లో కేటరింగ్ ఎలా ఏర్పాటు చేయాలో సలహాలిచ్చే సలహాదారు ప్రస్తుతం బొంబాయివాలా కంపెనీలో చేరడం.

ఆరు : గుజరాత్‌వాలా ఇంటిపై ఇన్‌కమ్‌టాక్స్ అధికారులు దాడి చేసి నీలివీడియో కాసెట్లు పట్టుకోవడం.

ఏడు : ఖర్చుదారి అలవాటు (కాన్‌స్పిక్యువస్ కన్‌జంప్షన్) మరిగిన జనాభా యొక్క మారుతున్న అభిరుచుల వల్ల ఖరీదైన మెత్తటి ఉప్పు అమ్మకాలు పెరగబోతాయని ఒక అంచనా.

ఎనిమిది : కొత్తగా వెలుగులోకి వచ్చిన మసూటా దేశంలోని నలభైవేల జనాభాలో ఇరవై శాతం జనాభా బొంబాయివాలా మెత్తటి ఉప్పే వాడతారన్న సర్వే.

తొమ్మిది : 2090వ సంవత్సరంలో ఒక పెద్ద ఉల్క బంగాళాఖాతంలో పడి సముద్రంలోని ఉప్పును నూరేయబోతున్న కారణంగా అటుపై రాళ్ల ఉప్పును ప్రజలు మర్చిపోతారన్న ఒక ఊహ.

పది : గుజరాత్ వాలా కంపెనీ యూనియన్ జాయింటు సెక్రటరీ, వైస్ ప్రెసిడెంటూ ఒక అమ్మాయి విషయంలో ఘర్షణపడి వేరు కుంపట్లు పెట్టుకోబోతున్నారన్న వార్త.

ఈ ఆటుపోటుల వల్ల జరిగిన ఫలితాలు ఇవి :

1 'పసుపు' పత్రిక అమ్మకాలు పెరగడం.

2 పసుపు పత్రికలో షేర్ - ఎ- షేర్ కాలమ్ ఉండగా ఇతర మిస్టరీ, సస్పెన్స్ రచనలు అక్కర్లేదని పాఠకులు ఉత్తరాలు రాయడం.

3 షేర్ మార్కెట్‌లో ఉత్సాహం కనబరచి పెట్టుబడి పెట్టడంలో పాఠకురాండ్రతో పాటు వారి భర్తలూ యథాశక్తి తోడవడం, తద్వారా ఉషారత్తయ్య జవాబు చెప్పుకోవలసినవాళ్లు రెట్టింపు కావడం.

4 అత్తయ్యకు నాపై అభిమానం పెరిగినట్టు నాకనుమానం రావడం

బసవరాజు షేరు మార్కెట్టులో పెద్ద ఎత్తున ప్రవేశించేనాటికి మా గుజరాత్‌వాలా కంపెనీ షేర్ల పరిస్థితి ఫర్వాలేదన్న స్థితిలో ఉంది. కానీ బసవరాజు కొన్ని ప్రత్యేక కంపెనీల షేర్లను బుల్లిష్ పద్ధతిలో ఎడాపెడా కొనేసి విపరీతంగా ధరలు పెంచేయడం మొదలెట్టాడు. ఏ కంపెనీ షేర్లు ఎందుకు కొంటున్నాడో ఎవరికీ అర్థం కాలేదు. అతనికీ తెలీదేమో! దాంతో ప్రజలంతా మిగతా కంపెనీల షేర్లు అమ్మేసి ఆ కంపెనీ షేర్లు కొనడానికి ఎగబడ్డారు. అందరూ అమ్మజూపడంతో బొంబాయివాలా కంపెనీషేర్లూ, గుజరాతీవాలా కంపెనీషేర్లూ కూడా దిగజారడం మొదలెట్టాయి. ఆ ప్రక్రియకు జాంబవంతరావు తనవంతు సాయం తను చేసాడు. బొంబాయివాలా అరేబియాసముద్రంలో కలిసినా ఫర్వాలేదుగానీ, గుజరాత్‌వాలా కంపెనీ ధరలు పడిపోవడంతో 'పసుపు' పాఠకబృందం కత్తులు నూరడం పెంచారు. మధ్యలో అత్తయ్య మీద పెరిగిన అభిమానం అంతా తుడిచి పెట్టుకుపోసాగింది.

మనకి ఇష్టం లేకపోయినా కొన్ని విషయాలు ఒప్పుకుతీరాలి. అత్తయ్య వల్ల అప్పుడప్పుడు ఉపయోగాలున్నాయి. గాజుదీపాలషాపులో గుడ్డెద్దులా (పింగాణీ సామాన్లు అమ్మేందుకు ప్రత్యేకమైన దుకాణాలు ఇంగ్లీషు వాళ్ళకుండేవేమో, మనకి లేవుగా) బసవరాజు షేరు మార్కెట్టును దున్నేసి నన్ను నిశ్చేష్టుడిని చేసినప్పుడు అచలపతిని సలహా అడగడానికి అత్తయ్య దగ్గరుండడం పనికొచ్చింది.

మీకు తెలుసో తెలియదో జిందాతిలిస్మాత్‌లా అన్ని సందర్భాలలోనూ అచలపతిని వాడుకోవచ్చు. ఇరకాటాల్లోంచి జనాల్ని అవతలకి పడేయడంలో అతడిని మించిన

ఆచంటమల్లన్న లేడు. అయినా పదిహేడురోజుల కురుక్షేత్ర యుద్ధం తర్వాత పాండవ సైన్యాధిపత్యం 'సాత్యకి'కి ఒప్పగించడమంటే ధృష్టద్యుమ్నుడెలా ఫీలవుతాడు? అయినా ఒప్పగించాల్సిన పరిస్థితి వస్తే ? నేరుగా సాత్యకిని అడగలేదు కదా! అందుకే అత్తయ్యను పిలిపించి, అచలపతిని పిలిచి, 'ఇదిగోనోయ్ పరిస్థితి. అత్తయ్య నీ సహాయం కోరుతోంది' అన్నాడు లౌక్యంగా.

అచలపతి నిక్కచ్చిమనిషి. నా దగ్గర జీతం తీసుకొంటున్నాడు కాబట్టి నా ఆజ్ఞయే మన్నించాలన్న నియమం అతనిది.

"అత్తయ్యగారి ఆదుర్దాను అర్థం చేసుకోగలను. మీరు కూడా అంతటి ఆదుర్దా ననుభవించి నా కాజ్ఞ ఇస్తున్నారని అనుకోవచ్చా సర్".

అత్తయ్య అనుమానపు దృక్కులను తప్పించుకొంటూ, అడావుడిగా "ఇదిగో అచలపతీ, నీ మిత్రభేదోపాయాలు ఆపు. అత్తయ్య ఆద్రుదాయే నా ఆరుద్రా. నేనిందులో పీకమునకలుగా తలదాకా మునిగున్నాను. నువ్వేదో ఒకటి చేసి ఆజ్ఞ అనుకో, అభ్యర్థన అనుకో, అఘోరింపు అనుకో... పనిమాత్రం చేసిపెట్టు... " అన్నాను.

ఏభై ఆరు సెకండ్ల విరామం తర్వాత "సరే సర్, షేరుమార్కెట్టు గురించి నాకు పెద్దగా తెలియకపోయినా, అది ఒక పద్ధతి ప్రకారం నడవని గందరగోళోకం అని తలచి దూరంగానే ఉంటున్నాను, మీ ఆజ్ఞను దలదాల్చి.."

"దాల్చుము, దాల్చుము. కానీ త్వరగా దాల్చుము."

"ఆ మార్కెట్టు పోకడలను అధ్యయనం చేయడానికి ఒక వారం గడువు కావాలి సర్. వచ్చే వారం ఇదే సమయం, ఇదే చోట కలుద్దాం సర్"అన్నాడు టీవీ సీరియల్ అనౌన్సర్‌లా.

యండమూరి వీరేంద్రనాథ్ సీరియల్‌లో ఆ వారపు ఇన్‌స్టాల్‌మెంటులో చివర 'టప్.. టప్.. టప్... మిగిలిన టప్‌లు వచ్చేవారం' అని ఆపేస్తే పై వారం టప్‌లు ఇంకా పెద్దవవుతాయా, ప్రెస్‌లో ఆ సైజు అక్షరాలు దొరక్క చిన్నవయిపోతాయా అని ఉత్కంఠతో కాచుకొని కూచున్న పాఠకుల్లా వారమంతా వేచి ఉన్నాం నేనూ, అత్తయ్యా.

వస్తూనే అచలపతి ఆరంభించేడు "బసవరాజు రంగప్రవేశంతోనే మీ అంచనాలు తలక్రిందులయ్యేయని తెలిసి, అతడి విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసాను సర్. అతను ఆదరించి ధరలు పెంచివేస్తున్న కంపెనీలలో ఉండే సామాన్యలక్షణం – కామన్ క్వాలిటీ – ఏమిటా అని పోల్చిచూసేను. అది కంపెనీల బాలన్స్ షీట్‌లు బాగుండడం

కాదు; ఒక గ్రూప్‌కి, ఒక ప్రాంతానికి చెంది ఉండడం కాదు; ఒక ప్రత్యేకమైన ఉత్పత్తులు తయారుచేయడం కాదు. కానీ అతనొక నిర్ణీతమైన పంథాను అవలంబించి ఆ కంపెనీలను ఆదరిస్తున్నాడు".

"ఏమిటా పంథా?" గులేబకావళి పుష్పం ఎక్కణ్నుంచో తెచ్చినా చేతికివ్వకుండా తానెక్కిన కొండలు, గుట్టలు గురించి వర్ణిస్తున్న పుత్రుణ్ని 'చూసి' అసహనంగా ఫీలవుతున్న గుడ్డితండ్రిలా అడిగింది అత్తయ్య.

అచలపతి చలించలేదు . రాత్రి కలలో తట్టిన కొత్త సిద్ధాంతాన్ని తెల్లవారి గుర్తుకు తెచ్చుకొంటున్న సైంటిస్టులా అరమోడ్పు కన్నులతో అచలపతి తనకు తానే చెప్పుకొంటున్నాడు -

"దేరీజ్ ఎ మెథడ్ ఇన్ హిజ్ మాడ్‌నెస్ - పైత్యంలో ఓ పద్ధతి, తిక్కలో ఓ తీరు, అనవచ్చు తెలుగులో - అతను కొనే కంపెనీల షేర్లు ఇంగ్లీషు అక్షరమాలలో ప్రతీ మూడవ అక్షరంతో ఆరంభమవుతున్నాయి."

"సరిగ్గా విడమర్చి చెప్పు" అంది అత్తయ్య కంగారుగా. నా పోలికే వచ్చినట్టుంది. ఏదీ చట్టున అర్థం కాదు.

ధ్యాన సముద్రం నుండే సమాధానం వచ్చింది. "ఎ, బి, వదిలిపెట్టి 'సి'తో ఆరంభమయ్యే కంపెనీల షేర్లు కొంటాడాయన. తర్వాత డి, ఇ విడిచి పెట్టి ఎఫ్.."

"అందుకే జి-గుజరాత్‌వాలా కంపెనీ షేర్లు కొనేలేదన్నమాట" అన్నాను షెర్లాక్ హోమ్స్‌లా.

"బొంబాయివాలా- బి-రెండో అక్షరం - అందుకే వాడివీ కొనలేదు" అంది అత్తయ్య వాట్సన్‌లా.

"మరి తక్షణ కర్తవ్యం?" అన్నాడు నాలోని మాయబజారు దుశ్శాసనుడు.

అచలపతి మందహసించేడు, "విషయం చెప్పి, తమ కంపెనీల పేర్లు సి,ఎఫ్,ఐ వగైరాలతో మొదలెట్టేట్టు మార్చామని అప్లికేషన్ పెట్టుకోమని గుజరాత్‌వాలా కంపెనీకి సలహా చెప్పడమే".

"మరి తదుపరి కర్తవ్యం?"అంది దుశ్శాసనుని చెల్లెలు.

"కంపెనీ షేర్ల రేటు పెరుగుతూండగానే షేర్లు అమ్మేయమని 'పసుపు' పాఠకులకు సలహాచెప్పండి. బసవరాజు ఇంత డబ్బు ఏ బ్యాంకులను లూటీచేసి తెస్తున్నాడో తెలియదు. అతిత్వరలోనే బుడగ పేలిపోవడం, అతడిని నమ్మిన మధ్యతరగతి

జీవులు అధోగతికి జారడం తథ్యం. ముందుగా మేలుకొన్నవాళ్లు ధన్యులు. వారిని భాగవిపణి ఆటుపోటులు అంటవు" అన్నాడు అచలపతి సెర్మనాంది మౌంట్ లెవెల్లో.

రెండు నెలల తర్వాత షేర్ – ఎ–షేర్ వివాదం నుండి బయట పడ్డాక అత్తయ్య బహుమతి పట్టుకొచ్చింది. నాకు కాదు, అచలపతికి. ఎంతో తెలివీ, డబ్బూ తన కోసం ఖర్చుపెట్టినా నాకు చిన్న చిరునవ్వైనా లేదు. అందుకే అత్తయ్యలకు ఆర్సెనిక్ పెట్టేవాళ్లకు నా ఆశీస్సులుంటాయంటాను.

